క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న రాజిరెడ్డి

నర్సాపూర్: సీఎం రిలీఫ్ ఫండ్ పథకం కింద ఆయన ఆయా మండలాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు సుమారు 9.13 లక్షల విలువజేసే చెక్కులను శుక్రవారం పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వెలగని హైమాస్ట్ లైట్లు



వెలగని హైమాస్ట్ లైట్లు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రమైన శివ్వంపేటలో ఏర్పాటు చేసిన పలు హైమాస్ట్ లైట్లు వెలగడం లేదు. రెండు సంవత్సరాల క్రితం ఎంపీ, ఎమ్మెల్యే నిధులతో తూప్రాన్–నర్సాపూర్ హైవే శివ్వంపేట డివైడర్ మధ్యలో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేశారు. కొన్ని రోజుల నుంచి పలు హైమాస్ట్ లైట్లు వెలగడం లేదు. కొన్నాళ్లకే లైట్లు వెలగకపోవడంతో పట్ల గ్రామస్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పని చేయని హై మాస్ట్‌లకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఈ విషయం గురించి పీఆర్ ఏఈ భాస్కర్‌రావు వివరణ కోరగా.. హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేసిన కాంట్రాక్టర్ కాలపరిమితి సంవత్సరం మాత్రమేనని వాటి నిర్వహణ పంచాయతీకి అప్పగించామని చెప్పారు. పంచాయతీ కార్య దర్శి రమాదేవి దృష్టికి తీసుకెళ్లగా వెలగని హైమాస్ట్ లైట్లకు మరమ్మతులు చేయిస్తామన్నారు.

యువతి అదృశ్యం



శైలజ

శివ్వంపేట(నర్సాపూర్): యువతి అదృశ్యమైన సంఘటన మండల పరిధి దొంతిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పటాల నర్సింలు కూతురు శైలజ గురువారం మధ్యాహ్నం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి వస్తానని చెప్పి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో శుక్రవారం యువతి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మనువరాలు, కోడలు ఆచూకీ తెలపండి



మంజుల, జెసిక

హవేళిఘణాపూర్(మెదక్): కోడలు, మనువరాలు రెండు నెలలుగా కనిపించడం లేదని మండల పరిధిలోని ర్యాలమడుగుకు చెందిన ఏర్పుల పెంటయ్య శుక్రవారం మెదక్‌రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పెంటయ్య కుమారుడు బాల్‌రాజ్ 8 ఏళ్ల క్రితం మృతి చెందాడు. దీంతో అప్పటినుంచి కోడలు మంజుల, మనువరాలు జెస్సిక వారి తల్లిగారి ఊరు వెల్దుర్తి మండలం దామరంచలో నివాసం ఉంటున్నారు. రెండేళ్ల క్రితం అక్కడి నుంచి హైదరాబాద్‌కు బతుకుదెరువు నిమిత్తం వెళ్లి అప్పుడుడప్పుడు ర్యాలమడుగు గ్రామానికి వచ్చిపోతూ ఉండేవారు. అయితే రెండు నెలలుగా ఫోన్, కనిపించడం లేదని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు.

న్యాయం చేయండి

చిన్నకోడూరు(సిద్దిపేట): తమ భూమి తమకు ఇప్పించి న్యాయం చేయాలంటూ రామునిపట్ల గ్రామానికి చెందిన రజకులు ఆవేదన వ్యక్తం చేశారు. రజక సంఘం సభ్యులు శుక్రవారం మాట్లాడుతూ గ్రామంలో సర్వే నంబరు 240లో ప్రభుత్వం 2005లో కేటాయించిన ఎకరం భూమిలో దోబీఘాట్ నిర్మించుకుని జీవనం సాగిస్తున్నామని చెప్పారు. ఇటీవల గ్రామానికి చెందిన వాసరి ఐలయ్య ఆ అక్రమంగా గొర్రెల షెడ్డు నిర్మిస్తున్నాడని, ఈ విషయమై తహసీల్దార్, సిద్దిపేట ఆర్డీఓ కార్యాలయాల్లో ఫిర్యాదు చేశామని తెలిపారు. అధికారులు స్పందించి తమ భూమికి హద్దులు చూపి అప్పగించాలని కోరారు.



పట్టా పత్రాలు చూపుతున్న రజకులు

సమగ్ర సస్యరక్షణతోనే అధిక దిగుబడులు

- వ్యవసాయ శాస్త్రవేత్తల సూచన
- తునికిలో రైతులకు అవగాహన



రైతులకు అవగాహన కల్పించిన శాస్త్రవేత్తలు

కౌడిపల్లి(నర్సాపూర్): సమగ్ర సస్యరక్షణతోనే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని తునికిలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వానాకాలం పంటల సాగు, అధిక దిగుబడులు, సమగ్ర యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ ప్రతాప్‌రెడ్డి, ఐఐఆర్ఆర్ శాస్త్రవేత్త డాక్టర్ బస్వరాజ్, ఎన్‌పీబీజీఆర్ శాస్త్రవేత్త డాక్టర్ ప్రణుష తదితరులు మాట్లాడారు. రైతులు విత్తన శుద్ధి తప్పనిసరిగా చేయాలన్నారు. పంట వేసింది మొదలు కోతకు వచ్చే వరకు ప్రతిరోజు పంటను గమనించాలన్నారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని సేంద్రియ వ్యవసాయం, ప్రకృతి వ్యవసాయం చేయాలన్నారు. భూసార పరీక్షలు చేయించి అవరం మేరకు ఎరువులు వాడాలని తెలిపారు. నేలతల్లి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని చెప్పారు. ఆవుమూత్రం, ఆవుపేడతో సేంద్రియ ఎరువులు జీవామృతం, ఘన జీవామృతం తయారు చేసి ఎరువుగా వాడాలని చెప్పారు. అధిక దిగుబడి కోసం మేలైన విత్తనాలను ఎంచుకోవాలని చెప్పారు. విత్తనాలు కొనేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని, విత్తనాల కొన్నతరువాత రశీదు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ఏఓ స్వప్న, ఏఈఓ సౌజన్య పాల్గొన్నారు.

ఇందిరమ్మ గృహ నిర్మాణానికి భూమి పూజ



ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న దృశ్యం

రేగోడ్(మెదక్): మండల కేంద్రమైన రేగోడ్, టి.లింగంపల్లికి మంజూరైన ఇందిరమ్మ గృహ నిర్మాణానికి స్థానిక కాంగ్రెస్ నాయకులు శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.దిగంబర్ రావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ శాంరావు కులకర్ణి మాట్లాడుతూ.. పేదలకు సొంతింటి కల సాకారం చేసేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తోందని తెలిపారు. లబ్ధిదారులు ఇళ్లను నిర్మించుకుని ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వట్‌పల్లి ఏఎంసీ డైరెక్టర్ శ్రీధర్ గుప్తా, గ్రామ పంచాయతీ కార్యదర్శి అరుణ్, కో ఆప్షన్ మాజీ సభ్యుడు చోటు మియా, పార్టీ ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ పాల్గొన్నారు.

అసంపూర్తి పనులకు రూ. 15 లక్షలు

ఎంపీ రఘునందర్‌రావు

సాక్షి ఎఫెక్ట్..

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని అల్లీపూర్ గ్రామంలో ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన ఫంక్షన్‌హాలు పనులకు రూ. 15 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ఎంపీ రఘునందన్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాక్షి దినపత్రికలో ఈ నెల 26న 'అసంపూర్తిగా మినీ ఫంక్షన్‌హాల్'కథనం ప్రచురితమైన విషయం విదితమే. ఈ విషయమై ఎంపీ స్పందించారు. ఎంపీ కోటా నుంచి రూ.15 లక్షలు నిధులు మంజూరు చేస్తూ సంబంధిత శాఖకు ప్రొసీడింగ్ ఇచ్చినట్లు ఆయన సాక్షితో చెప్పారు. జూన్ మొదటి వారంలో టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని మండల పంచాయతీరాజ్ ఏఈ భాస్కర్‌రావు శుక్రవారం చెప్పారు.

ప్రశాంతంగా పండుగలు జరుపుకోవాలి



శాంతి కమిటీ సమావేశంలో పాల్గొన్న మాట్లాడుతున్న డీఎస్పీ

తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్

నర్సాపూర్: ప్రశాంతంగా పండుగలు జరుపుకోవాలని తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్ సూచించారు. శుక్రవారం స్థానిక సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన శాంతి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కుల మతాలకు అతీతంగా పండుగలు జరుపుకోవాలని హితవు పలికారు. పండుగల సందర్భంగా ఎలాంటి ఘర్షణలకు తావివ్వరాదని సూచించారు. సీఐ జాన్‌రెడ్డి, ఎస్‌ఐ లింగం ఆయా పార్టీలకు చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు. ఇదిలాఉండగా శాంతి కమిటీ సమావేశం అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసి పలు రికార్డులు పరిశీలించారు. ఆయా కేసులను వీలైనంత త్వరగా ఛేదించి బాధితులకు అండగా ఉండాలని ఆదేశించారు. ఇటీవల తూప్రాన్ డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన నరేందర్‌గౌడ్‌ను పలువురు నాయకులు శాలువాలతో సన్మానించారు.

జీలుగ విత్తనాల పంపిణీ



జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏఈఓ రజిత

వెల్దుర్తి(తూప్రాన్): రైతులకు సబ్సిడీపై జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు మాసాయిపేట మండల వ్యవసాయ శాఖ విస్తరణ అధికారిణి రజిత ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో ఈ వానాకాలం సీజన్‌కు సంబంధించి 50 శాతం సబ్సిడీపై పచ్చి రొట్ట (జీలుగ) విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. మండలానికి 80 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు వచ్చినట్లు తెలిపారు. 30 కిలోల జీలుగ విత్తనాల బస్తా మొత్తం ధర రూ.4275 ఉండగా, 50 శాతం ప్రభుత్వ సబ్సిడీ పోగా, రైతు రూ. 2,137 చెల్లించాలన్నారు. జీలుగ విత్తనాలు అవసరం ఉన్న రైతులు తమ పట్టాదార్ పాస్ పుస్తకం జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్‌లను మాసాయిపేట రైతువేదిక వద్దకు తీసుకుని వచ్చి విత్తనాలు తీసుకోవాలని కోరారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి



పెద్దశంకరంపేట: బడిబాటలో ఉపాధ్యాయులు



కుసంగిలో ఉపాధ్యాయుల బడిబాట

పెద్దశంకరంపేట(మెదక్): బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని ఎంఈఓ వెంకటేశం సూచించారు. శుక్రవారం స్థానిక వడ్డెరవాడలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో ఉచిత విద్య, దుస్తులు, పుస్తకాలు, మధ్యాహ్న భోజనం వంటి సదుపాయాలను కల్పిస్తుందని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు విఠల్, సత్యకుమార్, ఉపాధ్యాయులు రామకృష్ణాగౌడ్, సిద్ధిరాములు, లక్ష్మణ్, సుధీర్, సాయాగౌడ్ తదితరులున్నారు.

కుసంగిలో బడిబాట

టేక్మాల్(మెదక్): టేక్మాల్ మండలం కుసంగి ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో శుక్రవారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయ బృందం జాతీయ గ్రామీణ ఉపాధి హామీలో భాగంగా పనిచేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రుల వద్దకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలల ప్రాముఖ్యతను, ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను గురించి వివరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు అశోక్ మాట్లాడుతూ నేటి సమాజంలో విద్య తప్పనిసరి అని, ప్రతి విద్యార్థిని తప్పకుండా చదివించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, మురళి సుభాష్ సీఆర్పి మొగులయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ అంజయ్య పాల్గొన్నారు.

కర్నాల్‌పల్లిలో బడిబాట

చేగుంట(తూప్రాన్): మండలంలోని కర్నాల్‌పల్లిలో శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ ఆధ్వర్యంలో తల్లిదండ్రుల కమిటీ సమావేశం నిర్వహించారు. బడిబాట ద్వారా పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తున్నట్లు తెలిపారు. ఉచిత పుస్తకాలు, యూనిఫాం దుస్తులు, మధ్యాహ్న భోజనం అందిస్తూ నాణ్యమైన బోధన జరుపుతున్నట్లు వివరించారు. బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేలా చొరవ చూపించాలని కోరారు. అనంతరం గ్రామంలో కరపత్రాలతో బడిబాట ప్రచారం నిర్వహించారు.

3 నుంచి రెవెన్యూ సదస్సులు

కొండపాక(గజ్వేల్): మండల పరిధిలో జూన్ 3 నుంచి 20 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్యామ్ తెలిపారు. 3వ తేదీ నుంచి 6 వరకు వరుసగా రాంపల్లి, ఖమ్మంపల్లి, మర్పడ్గ, గిరాయిపల్లిలోను, అలాగే 9 నుంచి 13 వరకు సిర్సనగండ్ల, దమ్మక్కపల్లి, కొండపాక. జప్తినాచారం, దర్గా, 16 నుంచి 20వరకు బందారం, అంకిరెడ్డిపల్లి, దుద్దెడ, విశ్వనాథపల్లి, తిమ్మారెడ్డిపల్లి, వెలికట్ట గ్రామాల్లో సదస్సులు ఉంటాయని శుక్రవారం ఆయన చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బాలుడి కుటుంబానికి పరామర్శ



బాలుడి తల్లిదండ్రులను పరామర్శిస్తున్న ప్రభాకర్‌రెడ్డి, వెంకటయ్య

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని అల్వాల గ్రామానికి చెందిన బీడ కనకయ్య లావణ్య దంపతుల కుమారుడు నికాస్ రొటోవేటర్‌లో పడి మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి ఆ కుటుంబ సభ్యులను శుక్రవారం పరామర్శించారు. వారి వెంట లక్ష్మీలింగం, ఎండీ అహ్మద్, సత్యనారాయణ, మల్లేశం, బాల్‌రాజు ఉన్నారు.

కారు, ట్రాక్టర్ ఢీ

దుబ్బాకరూరల్: కారు, ట్రాక్టర్ ఎదురెదురుగా వచ్చి ఢీకొన్న ఘటన అక్బర్‌పేట భూంపల్లి మండలం నగరం చౌరస్తా వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ హరీశ్ కథనం ప్రకారం.. నగరం గ్రామానికి చెందిన ఓ ట్రాక్టర్ రాళ్లలోడ్‌తో రామలింగేశ్వర ఫంక్షన్ హాల్ వైపు వెళ్తుండగా మెదక్ వైపు వెళ్తున్న ఓ కారు ఢీ కొట్టింది. దీంతో కారు పాక్షికంగా దెబ్బతిన్నది. ఎలాంటి ప్రమాదం జరగలేదని ఎస్‌ఐ తెలిపారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ



పాఠ్య పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎంఈఓ

దుబ్బాకటౌన్: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందిస్తున్నామని రాయపోల్ మండల విద్యాధికారి సత్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవా రం ఎంఈఓ కార్యాలయంలో ప్రభు త్వ పాఠశాలల హెచ్‌ఎంలకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభమవుతాయని, మొదటి రోజే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేయాలనే ఉద్దేశ్యంతో పుస్తకాలు పంపిణీ చేశామన్నారు.

వారాంతపు సంతను విస్తరించరా..?



వడియారంలో జరుగుతున్న వారాంతపు సంత

చేగుంట(తూప్రాన్): మండలంలోని వడియారం గ్రామంలో ప్రతి గురువారం జరిగే వారాంతపు సంత ఒకప్పుడు ప్రజలతో కిటకిటలాడేది. చేగుంట గ్రామం కన్నా పెద్ద గ్రామంగా వడియారానికి పేరుండటంతో ముప్పై సంవత్సరాల క్రితం వారాంతపు సంతకు గుర్తింపు వచ్చింది. కూరగాయలతో పాటు పశువుల సంత సైతం అదే రోజు నిర్వహించే వారు. మెదక్ నుంచి షటిల్ బస్సులు సైతం వడియారం గ్రామం వరకు వచ్చి తిరిగి మెదక్ వెళ్లేవి. కాలక్రమంలో చేగుంట మండల కేంద్రం కావడం 1980లో ప్రతి శుక్రవారం చేగుంటలో వారాంతపు సంత ప్రారంభించడంతో వడియారంలో సంతకు ఆదరణ తగ్గి పోయింది. కాగా, రెండు నెలలుగా వడియారంలోని వారాంతపు సంత క్రమంగా విస్తరిస్తూ మళ్లీ పాత రోజులు గుర్తుకొచ్చేలా మారుతుంది. చేగుంట వడియారం గ్రామాలు పక్కపక్కనే ఉండి కేవలం కిలోమీటరు దూరంలోనే ఉండటంతో కొందరు చేగుంట వాసులు వడియారం సంతకు రావడం ప్రారంభించారు. చిన్నశివునూర్, రామంతాపూర్, తండాలతో పాటు మాసాయిపేట మండలంలోని కొన్ని గ్రామాలు వడియారానికి దగ్గరగా ఉండటంతో గ్రామాల ప్రజలు వడియారం సంతకే ఆసక్తి చూపుతున్నారు. సంతలో దుకాణాలు పెరిగి మళ్లీ పూర్వపు స్థితిలో సంత జరిగేందుకు ఆస్కారం ఏర్పడింది. చేగుంటలో జరిగే సంతలో రద్దీతో మహిళలకు ఇబ్బంది, సెల్‌ఫోన్ దొంగతనాలు, జేబుదొంగల బెడద ఉండటంతో వడియారానికి సంతను ఎంచుకోవడం ఒక కారణంగా మారింది. పాలకవర్గం మరిన్ని సౌకర్యాలను కల్పించి సంతను విస్తరించేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య



తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్

హవేళిఘణాపూర్(మెదక్): విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు అన్ని వసతులు కల్పిస్తున్న ప్రభుత్వ పాఠశాలలకే విద్యార్థులను పంపించాలని మద్దుల్‌వాయి పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మద్దుల్‌వాయిలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవనం కలిగిన ఉపాధ్యాయులతో విద్యాబోధన అందించి మధ్యాహ్న భోజనం, మౌలిక వసతులు కల్పిస్తుందని చెప్పారు. అందుకోసం విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లోనే తమ పిల్లలను చదివించాలని సూచించారు. కార్యక్రమంలో రఘుబాబు, సంతోషికుమారి, విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు.

గో సంరక్షణ చట్టాన్ని అమలు చేయాలి



తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వెల్దుర్తి(తూప్రాన్): గోసంరక్షణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, గోవధకు కారణమవుతున్న వారిని కఠినంగా శిక్షించాలని మాసాయిపేట మండల బీజేపీ అధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి, యువమోర్చా అధ్యక్షుడు విఠల్ డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో మండల యువమోర్చా ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గేదెలు, లేగ దూడలను వధిస్తున్నారని, ఆరోగ్యంగా ఉన్న పశువులను వధించకూడదని చట్టం చెబుతున్నా ఆ నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని వారు ఆరోపించారు. అక్రమరవాణా జరగకుండా ఆపాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి రవికిరణ్ గౌడ్, ఉపాధ్యక్షులు శివ, శక్తి కేంద్ర ఇన్‌చార్జి సాయితేజ, ఓబీసీ మోర్చా నగేష్, బూత్ ప్రెసిడెంట్ బాలేష్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు



పెద్దశంకరంపేట: రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు



అల్లాదుర్గం(మెదక్): ఫర్టిలైజర్ దుకాణంలో తనిఖీలు చేస్తున్న ఎస్‌ఐ, వ్యవసాయాధికారులు



కొల్చారం(నర్సాపూర్): తనిఖీ చేస్తున్న ఏడీఏ

వ్యవసాయ అధికారి కృష్ణ హెచ్చరిక

పెద్దశంకరంపేట(మెదక్): నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని వ్యవసాయ అధికారి కృష్ణ, ట్రైనీ ఎస్‌ఐ అరవింద్ అన్నారు. శుక్రవారం పెద్దశంకరంపేటలోని ఆగ్రోస్, రైతునేస్తం, జగదాంబ, ధనలక్ష్మి తదితర ఫర్టిలైజర్ దుకాణాలలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎరువులు, విత్తనాల స్టాక్‌లను పరిశీలించారు. రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా రశీదులు తీసుకోవాలని, నిబంధనలకు విరుద్ధంగా నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు చేపడతామని హెచ్చరించారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే క్రిమినల్ కేసులు

అల్లాదుర్గం(మెదక్): నకిలీ విత్తనాలు విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ ప్రవీణ్ రెడ్డి చెప్పారు. శుక్రవారం అల్లాదుర్గంలోని దుకాణాలలో పోలీసులు, వ్యవసాయాధికారులు కలసి దాడులు నిర్వహించారు. విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఎవరైనా నకిలీ విత్తనాలు తెస్తే వెంటనే 100 నంబర్‌కు, పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. దుకాణాలలో స్టాక్ బోర్డులు, ఎరువులు విక్రయిస్తే బిల్లులు ఇవ్వాలని ఏఓ రాజేశ్ చెప్పారు. రైతులు కచ్చితంగా రశీదులు తీసుకోవాలన్నారు.

కొల్చారంలో...

కొల్చారం(నర్సాపూర్): రైతులకు నకిలీ విత్తనాలు అంటగట్టితే కఠిన చర్యలు తీసుకుంటామని కౌడిపల్లి ఏడీఏ పుణ్యవతి, ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆగ్రో సేవా కేంద్రం, రంగంపేట, ఎనగండ్ల గ్రామపంచాయతీ దుంపలకుంట చౌరస్తాలోని ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. దుకాణాల్లోని స్టాక్‌ను పరిశీలించారు. ప్రతి దుకాణం ముందు యజమానులు విత్తనాలకు సంబంధించిన వివరాలను, వాటి ధరలను సూచించే బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రైతులు కొనే ప్రతి విత్తనానికి, ఎరువులకు సంబంధించి రశీదులను తప్పనిసరి ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్వేత కుమారి, ఏఈఓలు ఉన్నారు.

పాపన్నపేటలో...

పాపన్నపేట(మెదక్): నకిలీ విత్తానాలు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్, ఏఓ నాగమాధురి హెచ్చరించారు. శుక్రవారం వారు పాపన్నపేటలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నాణ్యమైన విత్తనాలనే విక్రయించాలని సూచించారు. రైతుకు తప్పకుండా రశీదులు ఇవ్వాలన్నారు. విత్తనాల స్టాకు వివరాలు రోజువారీగా బయట ప్రదర్శించాలని చెప్పారు. ఈ సందర్భంగా దుకాణాలలోని స్టాకు రిజిస్టర్లు, విత్తనాల బ్యాగులు పరిశీలించారు.

సంక్షిప్త వార్తలు

◆ నిధులు మంజూరు చేయండి

హవేళిఘణాపూర్(మెదక్): మెదక్ మండల పరిధిలోని శివ్వాయిపల్లి గ్రామ ముదిరాజ్ కమ్యూనిటీ భవన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని ఆ సంఘం సభ్యులు శుక్రవారం ఎమ్మెల్సీ డాక్టర్ బండ ప్రకాశ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో శివ్వాయిపల్లి గ్రామ ముదిరాజ్ సంఘం సభ్యులు సంతోష్ తదితరులు ఉన్నారు.

◆ భూభారతి దరఖాస్తుల పరిశీలన

చిలప్‌చెడ్(నర్సాపూర్): చిలప్‌చెడ్ మండలంలోని పలు గ్రామాలలో భూభారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తున్నామని డిప్యూటీ తహసీల్దార్ సింధూజ అన్నారు. దరఖాస్తుల పరిశీలనకు రెండు బృందాలు పని చేస్తున్నాయని, తహసీల్, ఆర్డీఓ స్థాయిలో పరిష్కారమయ్యే సమస్యలను ముందుగా పరిశీలిస్తున్నామని చెప్పారు. భూసమస్యలు రికార్డులలోనే కాకుండా, క్షేత్రస్థాయిలో పరిశీలించి, పరిష్కారం చేస్తామన్నారు. త్వరలోనే సమస్యలు పరిష్కరించి, పట్టా పాస్‌బుక్కులు అందజేస్తామని చెప్పారు.

◆ నేటి నుంచి హనుమాన్ పునఃప్రతిష్ఠ ఉత్సవాలు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని రంగాయపల్లిలో శనివారం హనుమాన్ దేవాలయ పునఃప్రతిష్ఠ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు మాజీ వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి తెలిపారు. వేదపండితులు రాముశర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగనున్నట్లు చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

◆ మాజీ వైస్ ఎంపీపీకి ఎమ్మెల్యే పరామర్శ

శివ్వంపేట(నర్సాపూర్): శివ్వంపేట మాజీ వైస్ ఎంపీపీ రమాకాంత్‌రెడ్డిని శుక్రవారం దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి పరామర్శించారు. మండల పరిధిలోని కొత్తపేట గ్రామానికి చెందిన వైస్ ఎంపీపీ తండ్రి రిటైర్డ్ హెచ్‌ఎం నరసింహారెడ్డి పది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో రమాకాంత్‌రెడ్డిని ఎమ్మెల్యే పరామర్శించారు.

◆ 3 నుంచి భూభారతి గ్రామసభలు

చిన్నశంకరంపేట(మెదక్): చిన్నశంకరంపేట మండలంలోని రెవెన్యూ గ్రామాలలో జూన్ 3 నుంచి 20వ తేదీ వరకు భూ భారతి గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మన్నన్ తెలిపారు. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ఈ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తులు అందిస్తే పరిశీలించి పరిష్కరించనున్నట్లు తెలిపారు.